
# దృక్పథం



అపరాహ్ణవేళ.

వైశాఖమాసం సూర్యుడు ఆకాశం మధ్యకొచ్చి నిప్పులు చెరుగుతున్నాడు.

నెత్తిన హెల్మెట్ ఉన్నా మాడు కాలిపోతోంది. రుద్రాభిషేకం చేస్తున్నానని మా మిత్రుడొకడు కబురంపితే పొద్దున్నే ఇల్లు విడిచిపెట్టాను. కార్యక్రమం ముగిసేసరికి ఈ వేళయింది.

సోడా తాగి కాస్త సేద దీర్చుకుందామని ఓ సిటీస్టాప్ వద్దనున్న కిళ్లీ బడ్డీ దగ్గర స్కూటరాపాను.

లగేజి బ్యాగుతో బస్సు కోసం నిరీక్షిస్తున్నాడో యువకుడు. అతడు రాఘవరావు గారబ్బాయిలా ఉన్నాడు. ఔనా కాదా అన్న మీమాంసతోనే "నువ్వు వెంకటేశ్వర్లు కదూ" అడిగేశాను ఉండబట్టలేక.

ఔనన్నాడు తల ఆడిస్తూ.

"అయితే మీరు ఈ ఊళ్లోనే ఉంటున్నారన్నమాట. ఎక్కడుంటున్నారు?" ఆత్రంగా అడిగాను.

"చినవాల్తేర్లో"

"నాన్నగారు బావున్నారా?"

"లేరు. ఆయన కాలంచేసి రెండేళ్లయింది"

చివుక్కుమంది నా మనసు. "అయ్యో అలానా?" విచారం వ్యక్తం చేసాను.

"......"

"ఇంతకీ నేనెవరో గుర్తు పట్టావా?"

"చోడవరం బాబాయ్ అని మీరు పలకరించగానే పోల్చాను"

"గుడ్. బండెక్కు ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను"

"వద్దండి. నేను బస్సులో వెళతాను" మొహమాటపడ్డాడు ఆ అబ్బాయి.

"పరవాలేదు. నేనూ మీ ఇంటికే వస్తాను. ఎన్నాళ్లైందో మీ వాళ్లని చూసి"

నా మాటకు ఏమనుకున్నాడో ఏమో కిక్కురుమనకుండా స్కూటరెక్కాడు.

అతడి బ్యాగు నాకాళ్ల ముందు పెట్టుకుని బండి స్టార్ట్ చేసాను. పరుగెడుతున్న బండితో పోటీపడుతూ నా ఆలోచనలూ పరుగులు తీయసాగాయి. బ్యాంకు మేనేజరుగా నేను చోడవరంలో పని చేసేటప్పుడు రాఘవరావుగారు మా ఇంటి పక్కనే ఉండేవారు. వాళ్ళూ, మేమూ ఆ రోజుల్లో ఎంత సన్నిహితంగా ఉండేవాళ్లమో చెప్పలేను. ఆ కుటుంబం పట్ల నాకు అపారమైన ప్రేమ, అవ్యాజమైన అనుబంధం ఉన్నాయి. వాళ్ల పెద్దబ్బాయే ఈ వెంకటేశ్వర్లు. 'బాబాయ్' అంటూ ఎంత ఆప్యాయంగా పిలిచేవాడు! అప్పటి హుషారు, చురుకుతనం ఇప్పుడతడిలో ఈషణ్మాత్రం కానరావడం లేదు. పాపం తండ్రి పోయాడన్న బెంగేమో! అప్పట్లో ఆదాయం అంతంత మాత్రమైనా తన గంపెడు సంసారాన్ని ఎంతో గుట్టుగా నెట్టుకొచ్చేవాడు రాఘవరావు. అతడికి అభిమానం ఎక్కువ. అత్యవసర పరిస్థితుల్లో కూడా తన తిప్పలేవో తను పడేవాడే తప్ప నా సహాయాన్ని ఏనాడూ ఆశించలేదు. ప్రస్తుతం వాళ్ల స్థితిగతులేమిటో...ఎలా బతుకుతున్నారో? నా ఆలోచనలు ఓ కొలిక్కి రాకముందే "అదుగో ఆ ఇల్లే" అన్నాడు వెంకటేశ్వర్లు చిన్న పెంకుటింటిని చూపిస్తూ.

సరిగ్గా గుమ్మం వద్ద బ్రేకేసాను.

సంచి పుచ్చుకుని వడివడిగా లోపలకెళుతూ "బాబాయి గారొచ్చారమ్మా!" అన్నాడు వెంకటేశ్వర్లు.

కొడుకు సంబోధనకు విస్తుపోతూ చూసింది ఈశ్వరమ్మ.

"చోడవరంలో ఉండేటప్పుడు మన పొరుగున ఉండేవారు కదా!" గుర్తుచేసాడు వెంకటేశ్వర్లు.

"ఓహో వెంకట్రావ్ అన్నయ్యగారా. నమస్కారం. రండి, కూర్చోండి. అబ్బ ఎంతకాలానికి మళ్లీ?" కలుపుగోరుగా పలకరించింది ఈశ్వరమ్మ. పూర్వం మాదిరి దృఢంగా లేదామె. ఎంతో బలహీనంగా కనబడుతోంది. అయితే గొంతు మాత్రం మారలేదు అదే కంచు కంఠం.

కూర్చుందామని అటూ ఇటూ చూసాను.

నా అవస్థను గమనించినట్లుంది పడుకున్న వాళ్ల మేనత్త లేచి నిలుచుంది.

మెల్లగా మంచం మీద కూలబడ్డాను.

కాఫీ కలిపి తెస్తానంటూ వంటింట్లో కెళ్లిన ఈశ్వరమ్మ సరుకులు నిండుకున్నాయో ఏమిటో పంచదార నీళ్లు కలిపి పట్టుకొచ్చింది.

పానకం నాకు ఇష్టం లేకున్నా వాళ్ల మనసు కష్టపెట్టకూడదనుకుని గ్లాసు అందుకున్నాను.

"రాఘవరావుగారు మనందరినీ విడిచిపెట్టి వెళ్లిపోయారని విని షాకయ్యాను" తాగిన గ్లాసు కిందపెడుతూ అన్నాను.

జవాబుగా కంటతడి పెట్టింది ఈశ్వరమ్మ.

ఆమె కన్నీరు చూడలేక "మీ పెద్దమ్మాయి శారద" అంటూ మాట మార్చాను.

"నిరుడు ఈ రోజుల్లోనే దాని పెళ్లి అయిపోయింది." వెంకటేశ్వర్లు అన్నాడు.

"అప్పుడే ఇల్లాలైపోయిందన్నమాట. అదిసరే, మీ తమ్ముడు?"

"పట్టా పుచ్చుకుని పనికోసం తిరుగుతున్నాడు"

'పాపం ఏ దిక్కూ లేని ఆ కుటుంబసభ్యులు ఇప్పుడెలా రోజులు వెళ్లదీస్తున్నారో' బాధగా మూలిగింది నా మనసు.

"నాన్నగారు పోయాక డిసీజ్డు కోటాలో నాకు చిన్న ఉద్యోగం వచ్చింది. విద్యాశాఖలో రికార్డు అసిస్టెంటుగా పనిచేస్తున్నాను. ఇదే మా ఇంటిల్లిపాదికీ జీవనాధారం" నా ఆలోచనలకు అద్దం పట్టాడు వెంకటేశ్వర్లు.

వాళ్లకు ఆ మాత్రం ఉపాధి లభించినందుకు సంతోషించాను.

కంచాల దగ్గర వాళ్ల మేనత్త పిల్లలు దెబ్బలాడుకుంటూ ఉంటే సముదాయించేందుకు లోపలకెళ్లింది ఈశ్వరమ్మ. వాళ్లామెను పిసరంతైనా ఖాతరు చేయడం లేదు.

"ఎందుకు బాబూ అలా కొట్లాడుకుంటారు? మీకేం కావాలి?" అనునయంగా అడిగాను వాళ్ల దగ్గరకు లేచి వెళ్లి.

తన వడియాన్ని వాసు లాగేసుకున్నాడని చంద్రం. వాడికెప్పుడూ అమ్మ రెండేసి వడియాలు వేస్తుందని వాసు ఫిర్యాదు చేసారు.

"తప్పు బాబూ. వడియం కోసం మీరిద్దరూ అలా దెబ్బలాడుకోవచ్చా?" అన్నాడు ముక్కు మీద వేలు పెట్టుకుని.

"నంచుకుందుకి లేకుండా అన్నం ఎలా తినను?" అడిగాడు చంద్రం నా వంక అదోలా చూస్తూ.

ఆ పసివాడి మాటలకు నా హృదయం చలించిపోయింది ఉన్నపళంగా కళ్ల వెంబడి నీళ్లు చిప్పిల్లాయి. గభాలున బయటకెళ్లి స్కూటరు డిక్కీ లోంచి పళ్లు, స్వీట్లు తీసి వాళ్లకిచ్చాను.

"ఇప్పుడివన్నీ ఎందుకండి?" అన్నది ఈశ్వరమ్మ.

"ఫరవాలేదు. ప్రసాదమే. పిల్లల్ని తిననివ్వండి."

స్వీట్లన్నీ ఆబగా తినేయడంతో పాలబారింది చంద్రానికి.

"అంత తొందరెందుకురా, నెమ్మదిగా తినొచ్చుగదా?'' నెత్తిమీద కొడుతూ నీళ్ల అందించింది ఈశ్వరమ్మ.

వాళ్ల పరిస్థితి రాఘవరావుగారు ఉన్నప్పటికంటే అధ్వాన్నంగా ఉన్నట్లని పించింది. వస్తానని చెప్పి నిలబడ్డాను.

"ఈ మాటు వచ్చినప్పుడు వదినగారిని కూడా తీసుకురండి'' అన్నది ఈశ్వరమ్మ.

"రేపు మా నాన్నగారి ఆబ్దీకం. మీరు కూడా మాతో ఉంటే బాగుంటుంది.'' నన్ను గుమ్మం వరకు సాగనంపుతూ అన్నాడు వెంకటేశ్వర్లు.

అతడి అభ్యర్థనను తోసిపుచ్చలేక మరునాడు మళ్లీ వాళ్లింటికెళ్లాను.

మడికట్టుకుని భోక్తలకు పిండివంటలు వండి వడ్డించింది ఈశ్వరమ్మ.

వాళ్లకు ఘనంగా దక్షిణతాంబూలాలిచ్చి సత్కరించాడు వెంకటేశ్వర్లు.

తాము అర్ధాకలితో లేస్తూ ఇటువంటి వాటికి అంతఘనంగా ఖర్చు చేయడంలో నాకేమీ అర్థం కనిపించలేదు. అయితే అది వారి వ్యక్తిగతం. ఏది ఏమైనా దివంగత రాఘవరావుగారి పట్ల ఆ కుటుంబసభ్యులకున్న ప్రేమాభిమానాలకు ముగ్ధుడనయ్యాను.

భోజనాలనంతరం వీధి వరండాలో విశ్రమిస్తున్న సమయంలో వెంకటేశ్వర్లు వచ్చాడు. నాన్నగారి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో శారద పెళ్లి అయిందనిపించామని ఆయన చేసిన చిన్నా, చితకా అప్పులింకా ఉండనే ఉన్నాయనీ, వచ్చిన జీతం కుటుంబ పోషణకు చాలకపోవడంతో మరిన్ని చేబదుళ్లు చేయవలసి వస్తోందంటూ కుటుంబవిషయాలు వెల్లడించాడు.

ఎందుకో అతడి పట్ల నాకు సానుభూతి కలగడం లేదు. వాళ్ల దృక్పథం లో మార్పు రానంతకాలం వారి స్థితిగతులిలాగే ఉంటాయనిపించింది.

"చూడు వెంకటేశ్వర్లు! ఒకరు సంపాదిస్తే పదిమంది తినే రోజులు గతించాయి. నేడు భార్యాభర్తలిద్దరూ ఆర్జిస్తే తప్ప బతుకుబండిని ఈడవడం కష్టంగా ఉంది. అటువంటప్పుడు నీ ఒక్కడి సంపాదనతోనే కుటుంబాన్నంతటినీ నెట్టుకురావాలనుకోవడం అవివేకం'' ఉండలేక మనసులో మాట బయటపెట్టాను.

"నేనేం చేసేది బాబాయిగారూ! తమ్ముడు కూడా పట్టినే కూర్చోలేదు. ఉద్యోగం కోసం కాళ్లు అరిగేలా తిరుగుతున్నాడు. వాడి దరఖాస్తులకూ, ఇంటర్వ్యూలకూ, డబ్బు మంచినీళ్లలా ఖర్చవుతోంది. మా రోజులు ఎప్పుడు తిరుగుతాయో ఏమిటో!'' నిస్పృహగా పలికాడు వెంకటేశ్వర్లు.

"నేను చెప్పినట్లు చేస్తావా?'' అన్నాను వాడి కళ్లల్లోని నైరాశ్యాన్ని చూడలేక.

"చెప్పండి బాబాయిగారూ, మీరు నా తండ్రి లాంటివారు. మీ సలహా వల్ల మా కుటుంబ పరిస్థితులు మెరగవుతాయంటే నాకంతకన్నా కావలసిందేముంది?" అన్నాడు కంట తడిపెడుతూ.

"నా మీద నువ్వా మాత్రం నమ్మకం ఉంచావు కాబట్టి చెబుతున్నాను. కాలం మారుతోంది. దాంతోపాటు మన వైఖరిలో కూడా మార్పు రావాలి. ఒకసారి శ్రామికజనం వంక చూడు. వాళ్లు మనకంటే నిశ్చింతగా ఉండగలుగుతున్నారంటే అందుకు కారణం వాళ్లంతా కష్టించే నైజాన్ని కలిగి ఉండటమే. అందరూ కష్టపడతారు. కలబోసుకుతింటారు. అందుకే వాళ్లకు ఏ చీకూ చింతా ఉండదు. ముఖ్యంగా ముందు మనం చేస్తున్న దుబారా ఖర్చులకు మంగళం పాడాలి. ఇహ ఉద్యోగాలంటావా అవి దొరికే దాకా చేతులు ముడుచుకుని కూర్చోకుండా మనమే ఏదో ఒక స్వయం ఉపాధి కల్పించుకోవాలి. ఎలా అని ఆలోచిస్తున్నావా? లెక్కల గ్రూపుతో బి.ఎస్‌సి. చేసిన మీ తమ్ముణ్ణి ఏదైనా చిన్న కోచింగ్ సెంటర్ని ప్రారంభించమను. లేకపోతే పదిమందికి ట్యూషన్ చెప్పమను. ఆ పిల్లకు కుట్టుపనులేమైనా నేర్పించు. ఇరుగుపొరుగు వాళ్లకి జాకెట్లు కుట్టి పదో, పరకో సంపాదిస్తుంది. మిషను కొనుక్కుంటానంటే చెప్పు బ్యాంకులో అడ్వాన్సు ఇప్పిస్తాను. పోతే, మీ మేనత్త నీకు అదనపు భారం. ఆ కుటుంబాన్ని కూడా నువ్వే పోషించాలనుకోవడం తెలివితక్కువతనం. ప్రతి వ్యక్తీ తన కాళ్లమీద తను నిలబడాలి.

"ఆవిణ్ణి అప్పడాలు పెట్టమను. పచ్చళ్లు చేయమను. వాసూ, చంద్రం స్కూలు నుండి రాగానే వాటిని పట్టుకెళ్లి దుకాణాలకిస్తారు. తద్వారా లభించే ఆదాయం వాళ్ల జీవనానికి సరిపోతుంది. ఇలా కుటుంబంలో అందరూ శ్రమిస్తే అప్పుల బాధలుండవు. హాయిగా బతకొచ్చు" నాకు తోచిన సలహా ఇచ్చి ఆ ఇంటి నుండి బయటపడ్డాను.

కారణాంతరాల వల్ల ఓ సంవత్సరం తర్వాత గాని మళ్లీ నాకు వాళ్లింటికెళ్లడం కుదరలేదు. ఇప్పుడా ఇల్లు నా కళ్లకు ఓ చిన్న పరిశ్రమలా గోచరించింది. వరండాలో వాళ్ల మేనత్త అప్పడాలు వత్తి ఎండలో వేస్తుంటే ఎండిన వాటిని వాసు, చంద్రం లెక్కపెట్టి పోలిథిను సంచుల్లో సీలు చేస్తున్నారు. సరస్వతి గదిలో మిషను మీద లంగాలు, జాకెట్లు కుడుతోంది. వీర్రాజు దొడ్లో రేకుల షెడ్‌లో పాతికమందిని కూర్చోబెట్టి చదువు చెబుతున్నాడు. మునుపు కూర్చోడానికి కుర్చీ కూడా లేని ఆ ఇంట్లో ఇప్పుడు టీవీ, ఫ్యాన్లు, ఫర్నిచరు దర్శనమిస్తున్నాయి. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్న సూక్తి ఊరికే పుట్టిందా?

**( 22 సెప్టెంబర్, 2001 ఆంధ్రప్రభ వీక్లీ )**